క్లుప్తంగా

భూనిర్వాసితుల జాబితాపై ఆర్డీఓ సమీక్ష



రైతుల వద్ద వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత

మర్రిపాడు: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల జాబితాపై ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. జాతీయ రహదారి నంబరు 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండలంలోని పల్లవోలు, చుంచులూరు, పడమటినాయుడుపల్లి, పొంగూరు గ్రామాల రైతులకు భూ నష్టపరిహారం చెల్లించేందుకు 144 మంది రైతులకు సంబంధించిన వివరాలను సేకరించిన తహసీల్దారు ఆనందరావుతో భూములకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు.

ఆత్మకూరు డివిజన్‌లో 82.8 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గడిచిన 24 గంటల్లో శుక్రవారం ఉదయం వరకు 82.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా ఆత్మకూరులో 22.8 మి.మీ., మర్రిపాడులో 12.8, సంగంలో 17.8, అనంతసాగరంలో 15, కలువాయి 7.2, ఏఎస్‌పేటలో 3.2, ఉదయగిరిలో 0.8 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

రేపు కార్తీక దీపోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో ఆదివారం కార్తీకపౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు కార్తీక దీప దర్శనం ఉంటుందని భక్తులందరూ తరలి రావాలని కోరారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వరికుంటపాడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం స్థానిక కోదండరామస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రమా సమేత సత్యనారాయణస్వామి సామూహిక వ్రత కార్యక్రమం జరుగుతుందని హిందూధర్మ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి వెంకటమోహన్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన పౌర్ణమి రోజున ఈ వ్రతం ఆచరించడం ఈ ప్రాంత భక్తుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో దంపతులు వ్రత కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వ్రతంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు



గుంతలో పడిపోయిన ట్రాక్టర్

ఉదయగిరి: మండలంలోని మాసాయిపేట గ్రామ సమీపంలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మాసాయిపేటలో కంకర లోడు చేసుకొని గంగిరెడ్డిపల్లి వెళుతున్న ట్రాక్టర్ మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ నాగేశ్వరరావుకు స్వల్పగాయాలు కాగా ట్రాక్టర్‌లో ఉన్న కేశవులు అనే వ్యక్తికి తీవ్రగాయాలై కాలు విరిగింది. అతనిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

చేజర్ల: స్థానిక పీహెచ్‌సీలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ మెహతాబ్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెచ్ఐవీ ఉన్న వారిని చిన్న చూపు చూడరాదన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మున్ని, ఎల్‌డబ్ల్యూఎస్ వర్కర్ శ్రీను, నర్సులు పాల్గొన్నారు.

వేడుకగా గంధమహోత్సవం

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లపరెడ్డిపల్లిలో హజరత్ దర్గా వద్ద గంధ మహోత్సవం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని నూర్‌భాషాలు డీజే కోలన్న పాటలు, డప్పు వాయిద్యాలు, నవరంగి మేళాలతో రేగింపు నిర్వహించారు. ఫకీరులు ఖవ్వాలి పాటలు పాడారు. కార్యక్రమ నిర్వాహకులు రంతుల్లా, బాబు, నజీర్, హజరత్, ఖాసయ్య, ఖాదర్‌బాషా తదితరులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జగనన్నతోనే జనరంజక పాలన

గడిచిన నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా సమన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే భవిష్యత్‌లోనూ జన రంజక పాలన అందుతుందని, అందుకే రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అర్హుడని పలువురు వక్తలు విస్పష్టంగా చెప్పారు. చదువుకుని ఖాళీగా ఉన్న లక్షలాది మందికి సచివాలయ వ్యవస్థతో శాశ్వత ఉద్యోగాలు, అవకాశం ఉన్న వారికి వలంటీర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుంది. రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఓట్లు వేసి గెలిపిస్తే 30 ఏళ్ల పాటు జనాలకు శాశ్వత అభివృద్ధి సాధ్యమవుతుంది. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. లంచాలకు తావులేకుండా జరిగిన ఈ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు.



సీతారామపురం: మారంరెడ్డిపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, ఈఓపీఆర్డీ భార్గవి, తదితరులు



ఆత్మకూరు: ఏసీఎస్‌ఆర్‌కాలనీలో వలంటీర్లకు కిట్‌లు అందజేస్తున్న ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు



సంగం: జెండాదిబ్బలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.దేవసహాయం, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్, ఉపసర్పంచ్ నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య తదితరులు



చేజర్ల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాల గంగాధర్‌రెడ్డి, సర్పంచ్ చిన్నయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు బషీర్, తూర్పుపల్లి ఎంపీటీసీ కృష్ణారెడ్డి, చేజర్ల సర్పంచ్ ఏ వెంకటేశ్వర్లు నాయకులు తదితరులు



కలిగిరి: అనంతపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ జి. వెంకటేశ్వరరావు తదితరులు



జలదంకి: చినక్రాకలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వేములపాడు సర్పంచ్ బోడిమండ్ల వెంకటకృష్ణారెడ్డి, నాయకులు పులి మాల్యాద్రి, వట్టికాల బాలయ్య, పులి భాస్కర్ తదితరులు



మర్రిపాడు: బ్రాహ్మణపల్లిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, సర్పంచ్ ఓబులేసు, నాయకులు చెవుల శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ మస్తాన్‌ఖాన్ తదితరులు



ఆత్మకూరురూరల్: వెన్నవాడలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏఓ శ్రీనివాసులు, సర్పంచ్ జగన్నాథం ఆదిలక్ష్మమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షుడు బలరామిరెడ్డి, నాయకులు దిశించర్ల ప్రసాద్, రేవూరు విజయ నరసింహారెడ్డి, దాడి శ్రీనివాసులునాయుడు తదితరులు



అనుమసముద్రంపేట: కావలియడవల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, నాయకులు మాల్యాద్రినాయుడు, రమణయ్య తదితరులు



అల్లూరు: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, నాయకులు ఊటు శ్రీకాంత్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, మోహన్‌రెడ్డి, చెంతాటి కరుణాకర్, శ్రీను తదితరులు



వింజమూరు(ఉదయగిరి): బుక్కాపురంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనరు ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌రెడ్డి, స్థానిక నేతలు, అధికారులు

మెట్ట పైర్లకు మేలు చేసిన వాన

ఆత్మకూరురూరల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న జడివాన మెట్ట పైర్లకు మేలు చేసిందని వివిధ పంటలు సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రధానంగా సాగులో ఉన్న పొగాకు, వేరుశనగ, పెసర వంటి పంటలు ఈ వర్షాలతో కళకళలాడుతున్నాయి. ఈ దఫా పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో ఈ ఏడాది పొగాకు బోర్డు అధికారికంగా 4,600 హెక్టార్లు పంటల సాగుకు అనుమతులు ఇవ్వగా, వేలం కేంద్రం పరిధిలోని 15 మండలాల్లో ఇప్పటికే 3 వేల హెక్టార్లకుపైగా పొగాకు నాట్లు పూర్తయ్యాయని అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి. డిసెంబరు లోగా ఒకటి, రెండు వానలు పడినా ఈ ఏడాది పొగాకు రైతులకు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులతో పాటు రైతులు కూడా అభిప్రాయపడుతున్నారు. పచ్చిశనగ ఇప్పటికే 1500 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టగా, ప్రస్తుతం కురిసిన వర్షాలకు మరింత అధికంగా సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మెట్ట భూముల్లో పెసర, నువ్వు పంటలు కూడా సాగు చేసేందుకు సరైన అదను కావడంతో రైతన్నలు ఆ దిశగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.



రావులకొల్లులో మెట్ట భూముల్లో పొగాకు నాట్లు

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

వరికుంటపాడు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో నూతనంగా ఎంపిక చేసిన తొమ్మిది మందికి గ్రామ వలంటీర్లకు శుక్రవారం ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ నియామక పత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, నాయకులు మందలపు తిరుపతినాయుడు, బాదం సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

భక్తి శ్రద్ధలతో బ్రహ్మంగారి జయంతి

ఆత్మకూరు: కాలజ్ఞాన రచయిత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని బైపాస్‌రోడ్డులోని ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల మూలవిరాట్‌లకు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మంగారి జీవిత చరిత్ర, కాలజ్ఞాన కావ్యంపై అర్చకులు వివరించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.చెంచురత్నం దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్

రుణాల రికవరీపై దృష్టి సారించాలి

ఉదయగిరి: పొదుపు సంఘాల రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఏపీఎం ఖాజారంతుల్లా అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈసీ సమావేశం నిర్వహించారు. ఆయన సంఘాల వారీగా సమీక్షించి ప్రగతిని పరిశీలించారు. వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు, స్వయం సహాయ సంఘాల అధ్యక్షులు, వీఓఏలు సంఘాల్లో అర్హులైన గ్రూపు సభ్యులకు రుణాలు మంజూరు చేయించి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలన్నారు. సీసీలు పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో వీఓఏలు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకేపీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఎడతెరిపి లేని వర్షం

సోమశిల: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పల్లెల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలతో భూముల సాగుకు, వరి నార్లకు మంచిదని అంటున్నారు. మెట్ట పైర్లు, మిరప, నిమ్మతోటలు కళకళలాడుతున్నాయి. భూముల సారవంతం చేయడానికి వేసిన జనుము, జీలుగ వంటిపైర్లు ఏపుగా పెరుగుతున్నాయి.

మర్రిపాడులో..

మర్రిపాడు: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మర్రిపాడుతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులన్నీ జలమయం అయ్యాయి. మండలంలో విస్తారంగా సాగు చేసే పొగాకు పంటకు సరైన వర్షం లేక రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వర్షం పంట పొలాలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంగ్లిష్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హత కలిగిన వారు పూర్తి వివరాలతో శనివారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ టి కామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు మహిళలు మాత్రమే అర్హులని, సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి టెట్ పరీక్షలో అర్హతలు కలిగి ఉన్న వారు ఈ నెల 25వ తేదీ లోపు తమ పూర్తి వివరాలతో గురుకుల పాఠశాలలో అప్లికేషన్ దాఖలు చేసుకోవాలని ఆమె కోరారు.

గిరిజనుల అభ్యున్నతికి వెన్నెలకంటి కృషి



కావలి: గిరిజనుల అభ్యున్నతి కోసం వెన్నెలకంటి రాఘవయ్య ఎనలేని కృషి చేశారని సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. పట్టణంలోని ముసునూరు గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో శుక్రవారం స్వాతంత్ర సమరయోధుడు, పద్మభూషణ్ వెన్నెల కంటి రాఘవయ్య 42వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జీవీ సుబ్బమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచార కిట్‌ల పంపిణీ



ఇంటింటి ప్రచార కిట్‌లను పంపిణీ చేస్తున్న కన్వీనర్లు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్

అల్లూరు: ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే కావాలి అనే నినాదంతో త్వరలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అల్లూరు పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నార్త్ ఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్ధగుంట పంచాయతీ నాయకులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వారికి తెలియజేసి 2024లో కూడా జగనన్నే ముఖ్యమంత్రిగా చేసుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు రూరల్ అధ్యక్షుడు బీద రమేష్‌బాబు పాల్గొన్నారు.

కులగణన సర్వే బాధ్యతగా నిర్వహించాలి

ఉదయగిరి: ఈ నెల 27 నుంచి జరిగే కులగణన సర్వేను బాధ్యతగా నిర్వహించాలని వెంగళరావునగర్ సచివాలయ ప్రత్యేకాధికారి పి.శ్రీనివాసులు అన్నారు. ఆయన శుక్రవారం సచివాలయ ఆవరణలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సర్వేలో ప్రజలు సూచించిన విషయాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొంద్రు తిరుపతి, పంచాయతీ, రెవిన్యూ కార్యదర్శులు గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, బిల్లుపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బలక్ష్మమ్మ అన్నారు. ఆమె శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారికి ముగింపు సభలో బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల్లో అనేక విజ్ఞాన సంబంధమైన పుస్తకాలు ఉంటాయన్నారు. అనంతరం గ్రంథాలయాధికారిని, ప్రిన్సిపల్‌ను కళాశాల అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, అధ్యాపకులు విక్రమ్, నాగేంద్రప్రసాద్, వెంకటసుబ్బయ్య, శ్రీవాణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

మొక్కలు నాటిన ఎన్‌సీసీ విద్యార్థులు

కావలి: ఎన్‌సీసీ డే సందర్భంగా పట్టణంలోని పాతూరు అర్బన్‌హెల్త్ సెంటర్ ఆవరణలో మున్సిపల్ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్స్ మామిడి, పనస, నేరేడు, సీతాఫలం మొక్కలను శుక్రవారం నాటారు. హెల్త్ సెంటర్ డాక్టర్ వీవీచౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారావు మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు స్వచ్ఛభారత్ అభియాన్, రక్తదానం, ఎయిడ్స్‌పై అవగాహన తదితర సేవా కార్యక్రమాలను అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మస్తాన్ వల్లి, హవల్దార్ బ్రిజ్‌పాల్ రానా, తోకల వెంకటేశ్వర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది ఝాన్సీ, సునీత తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

పశు ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం సచివాలయంలో రైతులకు కలిగిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు కే సురేష్ శుక్రవారం పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 6,750 మంది రైతులకు పశు ఆరోగ్య సంరక్ష కార్డులు జారీ చేశారన్నారు. పశువులకు సంబంధించిన వైద్యం వివరాలు పూర్తి సమాచారం ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా కార్డులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవీంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేస్తున్న పశువైద్యులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వరికుంటపాడు: వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 23న నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శుక్రవారం కావలి డీఎస్పీ వెంకటరమణ విచారణ చేపట్టారు. ఈ నెల 22న మండలంలోని తూర్పుబోయమడుగుల బస్టాండ్ సెంటర్ వద్ద ఇత్తడి వెంకటయ్యపై అదే గ్రామానికి చెందిన చిలకపాటి వెంకటస్వామి దాడి చేసి కులం పేరుతో దూషించాడని వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆయన గ్రామానికి చేరకుని విచారణ చేపట్టారు. ఆయన వెంట వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు ఎస్సైలు విజయ్‌శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



గ్రామంలో విచారిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

ఢిల్లీ మహాధర్నా జయప్రదానికి సంతకాల సేకరణ

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా, దళితుల హక్కులు, సామాజిక, ఆర్థిక, భూ సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 4న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు మద్దతుగా సీపీఎం, కేవీపీఎస్ నాయకులు సంతకాల సేకరణ చేశారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీపతి, డేవిడ్‌రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

నాణ్యతలేని ఆహార పదార్థాలపై అవగాహన

వరికుంటపాడు: నాణ్యతా ప్రమాణాలు లేని ఆహార పదార్థాలపై స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తినే ఆహార పదార్థాలు, పరిశుభ్రతగా ఉంటే ఆరోగ్య వంతంగా, విద్యావంతులుగా తయారవుతారన్నారు. మనం కొనే ప్రతి వస్తువుపై తయారు తేదీ, గడువు తేదీ, నిర్దేశించిన ధరలను పరిశీలించుకుని తీసుకోవాలన్నారు. ఫోరం మండల ప్రెసిడెంట్ మహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్.మధుకృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.